ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య జిల్లా వార్తలు
5
శనివారం 27 సెప్టెంబరు 2025

ప్రజా సమస్యలను పట్టించుకోరు



ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురైతే ప్రభుత్వాధికారులు పట్టించుకోవాలి. ఉన్న భూములన్నీ కబ్జాకు గురైతే భవిష్యత్ తరాలకు ఏం మిగులుస్తాం. ప్రకృతి విపత్తులు రావడానికి.. ఆక్రమణలకు సహకరిస్తున్న అధికారులే కారణం.

- జయరామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నేత

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు చేకూరే లబ్ధిపై అవగాహన పెంచాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు. ప్రధాన మంత్రి కార్యక్రమంపై సమీక్షిస్తూ జిల్లాలో భూసేకరణలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరికీ జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల ప్రజలకు చేకూరే లబ్ధిపై ఈ నెల 25 నుంచి అక్టోబరు 19 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా మున్సిపల్, పోలీసు సేవలు జరిగాయని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టరు నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత మదనపల్లె సబ్ కలెక్టరు చల్లా కళ్యాణి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన అంశాలను కలెక్టరుకు వివరించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ.. జిల్లాలో తాగు, సాగు నీరు, ఎరువులు, ఆరోగ్యం తదితర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి శనివారం సాయంత్రం లోపు అధికారులు వారి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై నివేదికలు సిద్ధం చేసి ప్రత్యేకాధికారులకు పంపాలని సూచించారు. సమస్యలు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా, సమస్యలు రాక ముందే ముందస్తు ప్రణాళికలతో పరిష్కరించాలని ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాల ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని వ్యయసాయ శాఖ అధికారులను ఆదేశించారు. తాగు నీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్ని మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవోలు, ఆరబడబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అదేవిధంగా తదితర శాఖల అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్, మండల ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ కనిపిస్తే కబ్జా



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పక్కనే కబ్జాకు గురవుతున్న చెరువు

- ● కొండలు, గుట్టలపై కన్ను
- ● పట్టపగలే యంత్రాలతో చదును
- ● మొద్దు నిద్రలో యంత్రాంగం
- ● తొత్తులా పనిచేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు

గత ప్రభుత్వంలో అరాచక పాలన చూశాం. కబ్జాలు.. దాడులు.. దౌర్జన్యాలు.. అక్రమ కేసులతోనే కాలం గడిపారు. ఓటర్లు వైసీపీ సర్కార్‌ను సాగనంపి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారు. అయితే ఈ ప్రభుత్వంలోనూ కొందరు నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండా పోతోంది. ఖాళీ కనిపిస్తే చాలు.. అవి వాగులైనా.. వంకలైనా.. కొండలు.. గుట్టలైనా కబ్జా చేసేస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారులకు భయపడాల్సిన కిందిస్థాయి వారు, అధికార పార్టీ నేతలకు, షాడో నాయకులకు భయపడి ఏ పని చెప్పినా ఎస్.. సార్... అంటుండడంతో అక్రమార్కులు ఆడిందే ఆటగా తయారైంది. పట్టపగలే యంత్రాలను పెట్టి ఎకరాల కొద్దీ చదును చేస్తున్నా అడిగే వారు లేకుండా పోయారు. కడప-చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న చెరువు భూములను ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్నా రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు తొంగిచూడకపోవడంతో కబ్జారాయుళ్లు బరితెగించేస్తున్నారు.

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కావారిపల్లె రెవెన్యూ పొలాలకు సంబంధించి 1092, 1093 సర్వే నెంబర్లలో సుమారు 34 ఎకరాల భూమి గతపదేళ్ల క్రితమే ఆక్రమణకు గురవుతున్న సందర్భంలో అప్పటి తహసీల్దారు హెచ్చరిక బోర్డులను సైతం పెట్టించారు. అప్పటి నుంచి రెండుమార్లు ప్రభుత్వాలు మారినా ఎవరూ వాటిజోలికి పోలేదు. అయితే కూటమి నాయకులు వారి షాడోలకు కన్ను పడడంతో దర్జాగా యంత్రాలు పెట్టి చదును చేయిస్తున్నారు. సంబంధిత వీఆర్వోను కొంతమంది ప్రజలు, నాయకులు అడుగ్గా అధికార పార్టీకి చెందిన సార్‌లు చెప్పారని, మీకేమైనా సమాచారం కావాలంటే సార్‌లకు ఫోన్ చేసి చెప్పుకోవాలనడం గమనార్హం. అదేవిధంగా హైవే రోడ్డుపక్కనే ఉన్న గోవిందంపల్లె పంచాయతీకి చెందిన గోవిందమ్మ కుంటలో కొంతకాలం ముగ్గురాయి వ్యాపారం కోసమని కొందరు పెద్దలతో కలిసి ముగ్గురాయి వ్యాపారం ప్రారంభించారు. అనంతరం శాశ్వత కట్టడాలు కట్టి దర్జాగా చెరువు స్థలంలో వ్యాపారాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకొన్న పాపాన పోలేదు. కొర్లకుంట సబ్‌స్టేషన్ పక్కనే చెరువు భూమిని కూడా పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు వారి స్వాధీనంలో ఉంచుకున్నట్లు ఆరోపణలున్నాయి. పెద్దఓరంపాడు చెరువు పరిధిలో ఉన్న చిన్నఓరంపాడు రెవెన్యూ పొలాల్లో 1025 పురాతన గుడి, 1069 సాకిరేవుకుంట, 1027, 1028 సింగరేణి కుంటలో కూడా భూ ఆక్రమణలు జరిగాయని, వ్యవసాయ కార్మిక సంఘాలు సైతం ఆరోపణలు చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులకు భయపడాల్సిన రెవెన్యూశాఖ అధికారులు స్థానిక మండల స్థాయి నాయకులకు భయపడి వారు చెప్పినట్లు చేస్తున్నారని, అర్ధరాత్రి వేళలో అయినా వారి పనులు చక్కబెట్టుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పేదలు.. నిలువ నీడలేక ప్రభుత్వ స్థలంలో ఒక గుడిసె వేసుకుంటే వీఆర్‌వోల నుంచి తహసీల్దారు వరకు నానా హంగామా చేసి అవసరమైతే వారిపై కేసులు నమోదు చేసే అధికారులు, ఎకరాలు కబ్జా చేసే వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని చర్చించుకుంటున్నారు.



రెవెన్యూ అధికారులు అడ్డుకున్న ఎక్స్‌కవేటర్

నా దృష్టికి వచ్చింది

ముక్కావారిపల్లె రెవెన్యూ పొలంలో 1092, 1093 సర్వే నంబర్లలో భూకబ్జాలు జరుగుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. రెవెన్యూ సిబ్బందిని పనులు నిలిపివేయించాం. సమగ్ర విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదికలు పంపిస్తాం.

- మల్లికార్జునరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

కూలీల సంఖ్య పెంచండి : పీడీ



చిట్లూరు గ్రామంలోని ఉపాధి పనుల సప్లై చానల్‌ను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం, తదితరులు

రామాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఫీల్డ్ సిబ్బందికి ఉపాధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిట్లూరు గ్రామంలోని సప్లై ఛానెల్‌ను, నల్లగుట్టపల్లె గ్రామంలో రైతులు సాగుచేసిన నిమ్మతోటలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఉపాధి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1600 కోట్లు ఉపాధి పనులు జరిగితే, రామాపురం మండల పరిధిలో 50 కోట్ల మేరకు పనులు జరిగాయన్నారు. వీటికి సంబంధించిన కూలీల డబ్బులు 16 వారాల పాటు కూలీల ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటలను 4 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని, పండ్ల తోటలకు సంబంధించి మూడేళ్ల పాటు రైతుకు ఎకరాకు రూ.లక్షా 9 వేలు ప్రభుత్వం రైతు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శిక్షణకు సన్నాహాలు

కడప క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. శిక్షణ కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, తరగతి గదులను కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ డీటీసీ ఆవరణలో మొక్కలు నీటి నీరు పోశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, సిబ్బంది ఉన్నారు.



డీటీసీ ఆవరణలో మొక్క నాటుతున్న కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

ఆర్టీసీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

● ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

7



జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ ఎండీ

సైనిక లాంఛనాలతో మాజీ సైనికుడికి అంత్యక్రియలు

వివరాలు 7లో

కడప ప్రభుత్వ ఆసుపత్రి

ఆర్‌ఎంవో పెంచలయ్యపై విచారణ

● నెల్లూరు డీఎంహెచ్‌ఓగా భారీ అక్రమాలు

కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప 300 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్యశాల రెసిడెంట్ వైద్యాధికారి డాక్టర్ ఎం.పెంచ లయ్యపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నం జోన్-1 రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణిని విచారణాధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు నెలల్లోగా విచారణను ముగించి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది. నెల్లూరు జిల్లా ఆరోగ్య వైద్యాధికారిగా పనిచేసే సమయంలో పెంచలయ్య భారీగా అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. ఈ ఆరోపణలపై సంజాయిషీ చెప్పుకునేందుకు ఆయనకు అవకాశం కల్పిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 24న నోటీసులు జారీ చేసింది. మార్చి 6న ఆయన సమర్పించిన సంజాయిషీలతో సంతృప్తి పడని ప్రభుత్వం చివరికి విచారణకు ఆదేశించింది. నెల్లూరులో అక్రమాలకు పెంచలయ్య పూర్తి బాధ్యుడుగా ప్రభుత్వం నిర్ధారించింది. ఆరోపణలపై లోతుగా విచారణ చేయించి వాస్తవాలు నిగ్గు తేల్చాలని నిర్ణయించింది.

రూ.1.50 కోట్ల సెల్‌ఫోన్లు స్వాధీనం

● బాధితులకు అందజేసిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మేళాలో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న రూ.1.50 కోట్లు విలువ చేసే 610 మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్, ట్యాబ్ తిరిగి బాధితులకు అందించారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 8వ విడత మొబైల్ ఫోన్ రికవరీ మేళా జరిగింది. ఈ మేళాకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సెల్‌ఫోన్ బాధితులతో రద్దీగా మారింది. జూలై- సెప్టెంబరు 2025 మధ్యకాలంలో పోయిన వాటిని సైబర్ క్రైం, సోషల్ మీడియా, టెక్నికల్ అనాలసిస్ వింగ్, మొబైల్ రికవరీ ప్రత్యేక బృందం రికవరీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటి వరకు 8 విడతల్లో మొత్తం 2237 మొబైల్ ఫోన్లు రికవరీ చేయగా వాటి విలువ రూ.4.66 కోట్లు ఉంటుందన్నారు. పోయిన మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసి పోలీసు విశ్వాసాన్ని మరింత బలపరిచామన్నారు. ముఖ్యంగా రాయచోటి ప్రాంతంలో 119 సెల్‌ఫోన్లు పోగొట్టుకొనగా (83 రికవరీ) చేశామన్నారు. అలాగే మదనపల్లి ప్రాంతంలో 116కు గానూ (77), పుల్లంపేట మండలంలో 92కు గానూ (52), కోడూరు ప్రాంతంలో 67కు గానూ (53) చేశామన్నారు. అలాగే రాష్ట్రంలోని కడప, తిరుపతి, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, విజయవాడ, గుంటూరు జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, బీహార్, కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీలో కృషి చేసిన రిజర్వు ఇన్‌స్పెక్టర్ జాన్ జోసెఫ్, సీఐ మహమ్మద్‌అలీ, టెక్నికల్ అనాలసిస్, సైబర్ క్రైం, సోషల్ మీడియా సిబ్బందిని మొబైల్ ఫోను రికవరీ చేసిన బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రజలు తమ ఫోన్లు పోయిన వెంటనే ఎల్ఎంటీఎస్ వాట్సాప్ నెంబర్ 8688830012కు గానీ, సీఈఐ ఆర్ వెబ్‌సైట్ ద్వారా సులభంగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. అపరిచితుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయవద్దని, బిల్లు, మొబైల్ బాక్స్, గుర్తింపు పత్రాలు ఉన్నప్పుడే కొనుగోలు చేయాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని సూచించారు. అనంతరం పలువురు బాధితులు మాట్లాడుతూ తాము కోల్పోయిన ఫోన్లు తిరిగి పొందడంతో ఆనందంగా ఉందని, ఎస్పీకి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజరాజేశ్వరీదేవి.. పాహిమాం...

- ● వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ● కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



మహాలక్ష్మీ అలంకరణలో రెడ్డెమ్మతల్లి



రాయచోటి వీరభద్రాలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్లకు రోజుకో అలంకారం గావించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఇందులో భాగంగా రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాంధీబజారులో కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవి అలంకరణ, పాతరాయచోటిలోని ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమచ్చారు. అలాగే మదనపల్లె కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మహాలక్ష్మీ అలంకారం, గుర్రం కొండ రెడ్డెమ్మతల్లి మహాలక్ష్మీ అలంకరణలో, పీలేరు కన్యకా పరమేశ్వరి మోహినీ అలంకరణలో, రైల్వేకోడూరు లో బాలత్రిపురసుందరి అలంకారం, రాజంపేటలో విశాలాక్షిదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి, చిట్వేలిలో లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు.



మదనపల్లె కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహాలక్ష్మీ అలంకారం



చిట్వేలిలో లక్ష్మీదేవి అలంకారం



మోహినీ అలంకరణలో పీలేరు కన్యకా పరమేశ్వరి



రైల్వేకోడూరులో బాలత్రిపురసుందరి అలంకారంలో అమ్మవారు



రాజంపేటలో విశాలాక్షిదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి



పత్తిపంటకు పిచికారి చేస్తున్న రైతు

రైతన్నలూ.. జర భద్రం

- క్రిమిసంహారక మందుల పిచికారీతో అప్రమత్తత అవసరం
- అధికారుల సూచనలు పాటించండి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందులు అంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. అవి మన శరీరంలోకి వెళ్లినా, వాటి వాసనను పీల్చినా ఆరోగ్యానికి హానికరం. పంటలపై పురుగు మందులు పిచికారి చేయడంలో అవగాహన లేకపోవడం, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలతో రైతులు, వ్యవసాయ కూలీలు అనారోగ్యానికి గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలను ఆశించే చీడపీడల నివారణకు లేదా కలుపు నివారణకు మందులు పిచికారి చేస్తున్నారు. ఆ సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అవగాహన అవసరం

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగుమందులపై రైతులు అవగాహనను పెంచుకోవాలి. సంబంధిత దుకాణాల్లో నాలుగు రంగుల్లో పురుగుమందులు లభ్యమవుతున్నాయి. వీటిలో ఏవి విషపూరితమైనవి అనే విషయాన్ని తెలుసుకోవాలి. పుర్రెగుర్తుతో ఆకుపచ్చ, నీలి, పసుపురంగులతో కూడిన డబ్బాలు ఉంటాయి. పుర్రెగుర్తుతో కూడిన ఎర్రరంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నం ఉంటే తక్కువ విషపూరితమైనవని రైతులు తెలుసుకోవాలి.

మందు ప్రభావానికి గురైతే...

పురుగుమందుల ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి. మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య వస్త్రం ఉంచాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటికప్పి వెచ్చగా ఉంచి సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలను వైద్యులకు తెలియజేయాలని అధికారులు సూచిస్తున్నారు.

క్రిమి సంహారక మందులు పిచికారి చేయడానికి వ్యవసాయశాఖ సూచించిన స్ప్రేయర్లు (పరికరాలు) మాత్రమే వాడాలి. పంట స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లకన్నా, తైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కలపై నేరుగా మందును పిచికారి చేయవచ్చు.

జాగ్రత్తలు ఇలా..

- పురుగుమందు డబ్బా మూతను నోటితో తీయవద్దు, మందు ద్రావణాన్ని చేతితో కలపవద్దు. అవసరమైన మందు ఒకేసారి కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయవద్దు. పిచికారి సన్నగా తుంపర్లు పడేలా చూడాలి.
- మందు తగిన మోతాదులోనే పిచికారి చేయాలి. మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు, లేదా మూడు రకాల పురుగుమందులు కలిపి పిచికారి చేయవద్దు.
- చేతులకు గ్లౌజులు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు ధరించాలి. పత్తిపంటలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
- ఉదయం, సాయంత్రం గాలివీస్తున్న సమయంలో వెళ్లి పిచికారి చేయాలి.
- పురుగు మందుల పిచికారి సమయంలో పొగతాగరాదు, గుట్కాలు తినవద్దు.
- గాయాలైన చేతులతో మందుపిచికారి చేయకూడదు. పిచికారి పూర్తి అయిన వెంటనే కాళ్లు చేతులు డెటాల్‌తో శుభ్రంగా కడుక్కోవాలి.
- చిన్నపిల్లలకు పురుగుమందులను సాధ్యమైనంత దూరంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.
- పిచికారి అనంతరం వినియోగించిన పురుగుమందుల డబ్బాలను గొయ్యితీసి పాతిపెట్టాలి.

'అగ్రిసెట్'లో సాయిప్రశాంత్‌కు రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు



కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలికిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో అత్యున్నత అగ్రిసెట్ ర్యాంకు సాధించాడు. 2025-26 విద్యా సంవత్సరానికి వ్యవసాయ గ్రాడ్యుయేట్ కోర్సు (ఏజీబీఎస్సీ) లో ప్రవేశాల కోసం నిర్వహించిన అగ్రిసెట్‌లో స్థానిక వ్యవసాయ పాలి టెక్నిక్ కళాశాల విద్యార్థి ఎ.సాయి ప్రశాంత్ 5వ ర్యాంకు సాధించాడు. కడప జిల్లా దువ్వూరు మండలం రామ్‌సాయినగర్‌కు చెందిన ప్రభాకర్, లక్ష్మీదేవి (రైతు కుటుంబం) దంపతుల కుమారుడైన సాయిప్రశాంత్ కలికిరిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తిచేసి అగ్రిటెక్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకు చేజిక్కించుకున్నాడు. సాయి ప్రశాంత్‌ను ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆర్టీసీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

- ఎండీ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

జమ్మలమడుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేసి లాభాల బాటలోకి తీసుకెళ్లాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సూచించారు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణాన్ని ఆయన సందర్శించారు. ముందుగా ఆర్టీసీ డిపో ప్రాంగణం పరిశీలించారు. ప్రయాణికులకు మౌలిక వసతులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై మాట్లాడారు. అక్కడి నుంచి డిపో గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 1997లో తాను కడప జిల్లా ఎస్పీగా పనిచేశానన్నారు. అప్పట్లో అప్పట్లో ఇరుకైన రోడ్లు, ఇంత అభివృద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నామని, వచ్చే మూడేళ్లలో అన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం విజయవంతమైందని, అందుకు ఆర్టీసీలో పనిచేస్తున్న మెకానిక్‌లు, సిబ్బంది కృషి ఉందన్నారు. డిపో నుంచి బస్సు బయటికి వెళ్లేటప్పుడు బస్సు కండీషన్‌ను మెకానిక్‌లు బాగా చూసి పంపిస్తే... ప్రయాణికులు క్షేమంగా గమ్యస్థానం చేరి సంస్థకు మంచి పేరు వస్తోందన్నారు. జమ్మలమడుగు డిపోలో ప్రస్తుతం 88 బస్సులు ఉన్నాయని, కొత్త బస్సులు వచ్చేదాకా ఉన్న బస్సులనే జాగ్రత్తగా కండీషన్‌లో నడపాలన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాయలకులు టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఇంకా ఏపీఎస్‌ఆర్‌ఏసీ, ఏపీఎస్‌ఎమ్‌డీసీ, ఏపీ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ లెక్చరర్‌గా, సెంట్రల్ గవర్నమెంట్ ఓఎన్ జీసీ, జీఏఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బీపీఎల్, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నృత్య, సంగీత కోర్సులలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలోని లలితకళల శాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్ణాటక సంగీతం, కీబోర్డు, సర్టిఫికెట్ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలను ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ అక్టోబరు 18వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పదేళ్ల వయసు నిండిన వారి నుంచి తర్వాత ఏ వయసు వారైన ఈ కోర్సుల్లో చేరవచ్చని చెప్పారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇడియు.ఇన్‌ను సంప్రదించాలన్నారు. అలాగే 9032595101 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఉద్యోగులు, కళాకారులు ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ప్రశాంతంగా గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో తాత్కాలిక ప్రతిపాదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, టౌన్‌ప్లానింగ్ విభాగాలకు సంబంధించి నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగాయి. అభ్యర్థుల అర్హతలు, బోధన నైపుణ్యం, అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన గెస్ట్ ఫ్యాకల్టీ జాబితాను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్‌ఎస్)లో 2025-26 విద్యాసంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడిట్ తరగతుల ప్రవేశాల గడువు అక్టోబరు 31 వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 14ఏళ్లు నిండిన వారు పదవ తరగతిలో, 15ఏళ్లు పైబడిన వారు లేదా టెన్త్ పాసైన వారు ఇంటర్మీడియట్‌లో చేరవచ్చన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్ స్కూల్.ఏపీ.జీఓవి.ఇన్ లేదా సమీప స్టడీ సెంటర్‌ను సంప్రదించ వచ్చని తెలిపారు.

సీబీఆర్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం నింపేందుకు చర్యలు



సీబీఆర్‌లోకి విడుదలవుతున్న నీరు

లింగాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)లో గరిష్ట నీటిమట్టం 10 టీఎంసీల మేర నింపేందుకు నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల జరిగిన మంత్రివర్గం సమావేశంలో ప్రాజెక్టులను, చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించడంతో ఆ మేరకు సీబీఆర్‌కు గండికోట నుంచి ఎత్తిపోతల ద్వారా నీటి విడుదలను అధికారులు పెంచారు. పీబీసీ ఈఈ వెంకటరామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సీబీఆర్‌లో 7.4టీఎం సీలు ఉన్నాయని, గండికోట ప్రాజెక్టు నుంచి మూడు మోటర్లతో 1400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల ద్వారా విడుదల చేస్తున్నామని, పూర్తిస్థాయిలో ప్రాజెక్టులో నింపుతామని తెలిపారు.

వార్డు కార్యదర్శికి రెండేళ్ల సెలవు మంజూరు

కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బుడ్డాయపల్లె వార్డు అమెనిటీస్ కార్యదర్శి కె.జ్యోతిర్మయికి రెండేళ్ల అసాధారణ సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె వ్యక్తిగత పనుల మీద సౌదీ అరేబియా వెళ్లడానికి అనుమతించింది. తన భర్త దగ్గరకు వెళ్లడం కోసం జ్యోతిర్మయి చేసుకున్న దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి 2027 సెప్టెంబరు 30వ తేదీ వరకు రెండేళ్లు సెలవు మంజూరు చేసింది. ఈ కాలానికి ఎలాంటి జీతాలు, అలవెన్సులు చెల్లించరు. అక్కడకానీ, ఇతర విదేశాల్లో కానీ ఆమె ఎలాంటి ఉద్యోగం చేయడానికి వీలు లేదు. సౌదీ అరేబియాలో నివాసం చిరునామాను ఉన్నతాధికారులకు తెలియజేయాలని షరతులు విధిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సెలవు మంజూరు ఆదేశాలను జారీ చేశారు.

సైనిక లాంఛనాలతో మాజీ సైనికుడికి అంత్యక్రియలు



లక్ష్మిరెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మిలటరీ పోలీసులు

చాపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుపల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం మాజీ సైనికుడు మూల క్రిష్ణారెడ్డి (55)కి మిలటరీ పోలీసులు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈనెల 25న గురువారం ప్రొద్దుటూరు పట్టణంలోని తన ఇంటిలో లక్ష్మిరెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతని సొంత గ్రామం చెంచుపల్లె కావడంతో అంత్యక్రియలు ఇక్కడ నిర్వహించారు. మిలటరీ సైనికులు తుపాకులతో గాలిలోకి కాల్పులు జరిపి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా, ఆయన బెంగుళూరు, జమ్మూకాశ్మీర్ ప్రాంతాల్లో 15 ఏళ్లపాటు మిలటరీలో పనిచేశారు. ఆయనకు భార్య మల్లేశ్వరి, కుమార్తెలు రవీణారెడ్డి, రస్మికారెడ్డిలు ఉన్నారు. క్రిష్ణారెడ్డి మృతి వార్త తెలిసిన చెంచుపల్లె, చిన్నవరదాయపల్లె, మడూరు, అన్నవరం గ్రామాల ప్రజలు ఆయన మృతదేహాన్ని చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జమ్మలమడుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లె గనుల వద్ద శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు అర్బన్ సీఐ నరేష్‌బాబు సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా, మధ్యాహ్నం మృతుడి సోదరుడు సంపత్ పోలీసు స్టేషన్‌కు వచ్చి మృతదేహం తమ తమ్ముడిదేనని.. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్లితే... ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీనివాసగర్‌కు చెందిన బుడ్డాయిపల్లె శివకుమార్ (36) గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈయనకు వివాహం కాలేదు. అనారోగ్య కారణంగా మందులు వాడేవాడు. ఘటనా స్థలంలో టీబీకి సంబంధించిన మందులు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

- కుమారుడికి గాయాలు

రామాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని నల్లగుట్టపల్లి పంచాయతీ దర్గా రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటకొండ రాము (38) అనే వ్యక్తి లారీ కింద పడి మృతి చెందగా, అతని కుమారుడు జగదీశ్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ వడ్డెపల్లికు చెందిన కోటకొండ రాము తన కుమారుడు జగదీశ్‌తో కలిసి స్కూటర్‌లో రాయచోటిలోని అత్తగారింటికి వెళుతున్నాడు. మార్గమధ్యంలో రామాపురం సమీపంలో ఉన్న వైఎస్‌ఆర్‌కాలనీ వద్దకు రాగానే నిలబడి ఉన్న స్కూటర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జగదీశ్ రోడ్డు పక్కన పడగా, రాము అదే సమయంలో హైదరాబాదు నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ కిందపడ్డాడు. దీంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 రెండో విడత జిల్లా ఎంపికలు షెడ్యూలు ప్రకారం ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యా అధికారి, స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ అండర్ 19 సెక్రటరీ చంద్రమోహన్‌రాజు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం క్రీడా షెడ్యూలును తెలియపరిచారు. అందులో భాగంగా 27న కడప డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ షటిల్ పోటీలు జరగనున్నాయన్నారు.

కడప ఎమ్మెల్యేపై అసభ్య పదజాలంతో పోస్టింగులు పెట్టిన పలువురిపై కేసు

కడప క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిపై ఫేస్‌బుక్‌లో ఓ వీడియోను అసభ్య పదజాలాలతో కూడిన వీడియోలను పోస్టింగు పెట్టిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఎన్నికలకు ముందు పార్టీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారనే కారణంతో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి కొంతమందిని టీడీపీ నుంచి బహిష్కరించారు. వారిలో విజయలక్ష్మి అలియాస్ విజయారెడ్డి, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరమైన అవమానకరమైన భాషను కలిగి ఉన్న వీడియోను రికార్డు చేశారు. ఆ వీడియోను ఇస్మాయల్ బాషా అనే వ్యక్తితో పోస్టింగులు చేయించడంతో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఇస్మాయిల్ బాషాను అరెస్టు చేసి, కౌన్సెలింగు చేయడంలో పార్ట్1 నోటీసు అందించారు. మిగతా గుర్తు తెలియని వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఇరు వర్గాల మధ్య విబేధాలను రెచ్చగొట్టే విధంగా వీడియోను షేర్ చేశారని ఎమ్మెల్యే మాధవీరెడ్డి భర్త, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అసభ్యకరమైన పోస్టింగులు పెడితే రౌడీషీట్

అసభ్యకరమైన పదజలాలు, అశ్లీల వీడియోలను పోస్టింగులు చేసినా, వీడియోలు సోషల్ మీడియా వేదికలో ఇతరులకు షేర్ చేసినా వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో అసభ్య, అశ్లీల కంటెంట్ ఉన్న వీడియోలు గ్రూపుల్లో పెట్టడంతో పాటు ఇతరులకు కూడా పోస్టింగులు చేస్తున్నారని.. వీటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

రిమ్స్‌లో శిశువులకు ఆధునిక ల్యాపరోస్కోపీ శస్త్రచికిత్సలు

- సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్



కోలుకున్న శిశువుతో సూపరింటెండెంట్, వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప (రిమ్స్) సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో పిల్లల శస్త్ర చికిత్స విభాగంలో ఆధునిక ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్సల సేవలు అందుబాటులో ఉన్నాయని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇవి సాధారణంగా మెట్రో నగరాలలో లక్షల రూపాయల ఖర్చుతో జరిగే శస్త్రచికిత్సలు అని, ఎన్‌టీఆర్ వైద్యసేవ ద్వారా సేవలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ నెల 23న రాజంపేటకు చెందిన 13 నెలల వయసు ఉన్న చిన్నారికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పైలోరిక్ స్టెనోసిస్ అనే జీర్ణాశయ సమస్యకు అరుదైన ల్యాపరో స్కోపిక్ చికిత్సను నిర్వహించారు. బాలిక పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ శిశువుల్లో పైలోరిక్ స్టెనోసిస్ అనేది ఆహారం ఆయం (ఆమాశయం) నుంచి చిన్న పేగులోకి వెళ్లే మార్గమైన పైలోరస్ కండరాల మందంగా మారడం వల్ల ఆ మార్గం బిగుసుకొని ఆహారం పేగులవైపు వెళ్లకుండా అడ్డం కావడం, అధిక వాంతులు, బరువు పెరగకపోవడం, తిన్న వెంటనే వాంతులు వీటి లక్షణాలు అన్నారు. అలాగే మూడు నెలల బిడ్డకు పెద్దదైన అండాశయ సిస్టును ల్యాపరోస్కోపిక్ సిస్టెక్టమీ ద్వారా తొలగించడం, ఒక సంవత్సరం వయసు అబ్బాయికి ఇంగ్వైనల్ హెర్నియాకు ల్యాపరోస్కోపిక్ హెర్నియోటమీ, పదేళ్ల అమ్మాయికి పిత్తాశయంలో రాళ్ల సమస్యకు ల్యాపరోస్కోపిక్ కొలిసిస్టెక్టమీ ద్వారా నయం చేశామన్నారు. ఈ శస్త్రచికిత్సలు సాధారణంగా ఓపెన్ సర్జరీగా చాలా చోట్ల జరుగుతుంటాయన్నారు. కానీ ల్యాపరోస్కోపిక్ విధానం ద్వారా చేయడం తక్కువ నొప్పితో, త్వరితగతిన కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సేవలు పిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ సుకుమార్ సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కన్యకాపరమేశ్వరికి బంగారు హారం బహూకరణ



బంగారుహారం అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

వేంపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మవారిశాలలో కన్య కాపరమేశ్వరి దేవికి బంగారు హారం బహరాకరణగా అందించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, కుటుంబ సభ్యులతో కలిసి రూ.1.05 లక్షల విలువైన బంగారు హారాన్ని కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ పూజారి ఇంద్రకంటి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను శాలువ, పూలమాలలతో సత్కరించారు.

రావమ్మా.. మహాలక్ష్మీ..



నందలూరు: మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన కాళికాంబదేవి



రైల్వేకోడూరులో గంగమ్మతల్లికి డబ్బుతో అలంకరణ చేసిన దృశ్యం



రాజంపేటలో..



సుండుపల్లెలో..



లక్కిరెడ్డిపల్లెలో..

రాజంపేట టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం కన్యకాపరమేశ్వరి, వీరచౌడేశ్వరి, సాధుకామాక్షమ్మ, ఉదయగిరి యల్లమ్మ ఆలయాల్లో, అలాగే మండల పరిధిలోని వెంకటరాజంపేటలో వెలసిన కనకదుర్గ మహేశ్వర ఆలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం కన్యకాపరమేశ్వరి ఆలయంలో తోట ఉత్సవంలో భాగంగా వివిధ రకాల మొక్కలు, పండ్లతో ముస్తాబు చేసి మోహినిదేవి అలంకారం, చౌడేశ్వరి ఆలయంలో విశాలాక్షిదేవి అలంకరణ, సాధు కామాక్షమ్మ ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకరణ, వెంకటరాజంపేటలో కనకదుర్గ మహేశ్వర ఆలయంలో కనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వీరబల్లిలో..

వీరబల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న గంగమ్మ ఆలయంలో నవరాత్రుల సందర్భంగా మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గాలివీడులో..

గాలివీడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లచెరువు పంచాయతీ పశువులవాండ్లపల్లె సమీపంలో వెలసిన దుర్గామాత ఆలయంలో శుక్రవారం లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీలేరు రహదారిలో బస్టాండు సమీపంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా లక్కిరెడ్డిపల్లెలోని సర్వమంగళా దేవి, రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మీదేవి అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

చిట్వేలిలో..

చిట్వేలి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిట్వేలిలోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ మేరకు భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే చిట్వేలి శివాలయం అమ్మవారికి కుంకుమార్చన, వరదరాజస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరాలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజవీధిలో వెలసిన గంగమ్మ తల్లికి శుక్రవారం దేవి నవరాత్రుల సందర్భంగా భక్తులు డబ్బుతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు, రాహుకాల పూజలు చేశారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం లో బాలత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మీగా కాళికాంబదేవి

నందలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వెలసిన అశ్వయుజ శుక్లపంచమి ఐదో రోజు కాళికాంబదేవి మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మోహినీ అలంకారంలో కన్యకాపరమేశ్వరి

నందలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వాసవి కన్యకాపరమేశ్వరిదేవి మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తేటోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, చండీ పారాయణం, సాయంత్రం కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్ఠి, సెక్రటరి గెలివి నాగసురేంద్రకుమార్, ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి నమోస్తుతే..

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ చెక్‌పోస్టు సమీపంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉమాదేవి అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

మోహినీదేవి అలంకారంలో..

ఒంటిమిట్ట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు అయిన శుక్రవారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు మోహిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సోమిశెట్టి మనోహర్‌బాబు, సోమిశెట్టి హరిబాబు, ఓబయ్య, తుమ్మలపెంట శ్రీనివాసులు, రెంటాల హరిక్రిష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీదేవి అలంకారంలో దర్గామాత

రామాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీలోని దర్బారు సాయినగర్‌లో వెలసిన సమర్థ సద్గురు దర్గా మాతాజీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో ప్రజలకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం మహాగణపతి పూజ, గంగపూజ, మృత్తికపూజ, నవగ్రహ పూజ, కలశ స్థాపన, దర్గా మాతాజీకి అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం దేవీ శరన్నరాత్రి దసరా పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని గాంధీ బజారులో ఉన్న కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో, కొత్తపేట కార్తీకేయ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే కొత్తపేట రామాపురంలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో, పాతరాయచోటిలోని ప్రాచీన అగస్త్యేశ్వరస్వామ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో, తోపు గంగమ్మ ఆలయంలోని విజయచాముండేశ్వరిదేవి అమ్మవారు భవానీదేవి అలంకారంలో గాలివీడు రోడ్డులో ఉన్న గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



గాలివీడు రోడ్డులోని గంగమ్మ ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

చంద్రబాబు పాలనలో ప్రతి చెరువు నిండుకుండే..

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు



దేవదాసి చెరువుకు జలహారతి ఇస్తున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రతి చెరువు నిండుకుండలా కనిపిస్తోందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాలెంచెరువు, దేవదాసి చెరువులకు జలహారతి ఇచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి చెరువును అభివృద్ధి చేసి అందిస్తామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వర్షాలు కురవవన్నారు, నిండిన చెరువులు వారికి కనపడడం లేదా అని ప్రశ్నించారు. చెరువులు, కాలువలు పూడ్చి రియల్ ఎస్టేట్ చేసే మీరెక్కడ.. చెరువులకు కాలువలు తయారు చేసి నీరు అందిస్తున్న మేమెక్కడ అని ఎద్దేవా చేశారు. చెరువులను నింపి రైతులకు కల్పవృక్షంగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మహేశ్వరరాజు, అమరేశ్వర్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాభివృద్ధికి కృషి

గాలివీడు, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని గ్రామాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో పంచాయతీరాజ్ సూచిక వర్షన్ 1.0 నుండి 2.0 వరకు పరివర్తన వ్యాప్తిపై సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని మెరుగైన ఆరోగ్యం కోసం అందరం కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారు. మౌళిక సదుపాయాలు, స్వయం పరిపాలన, సామాజిక న్యాయం, భద్రత, మంచి పరిపాలన, గ్రామీణ భారతదేశం ఆర్థిక అంశాలు తదితర వాటిపై వివరించినట్లు తెలిపారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ముందస్తు ప్రణాళిక 2.0పై ప్రజాప్రతినిధులకు సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వరనాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు హాజరయ్యారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు 1.0 నుండి 2.0 ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపుపై హర్షం

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మరో 10 వేల సీట్లు పెంచాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించడం పట్ల రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల వైద్య విద్య సామర్థ్యం పెరిగి ఎక్కువ మంది స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి వస్తారని, అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్త విభాగాలు ప్రవేశపెట్టడానికి వీలవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్య సేవల విస్తరణలో భాగంగా 2028-29 నాటికి దేశంలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో 5 వేల పీజీ, 5,023 ఎంబీబీఎస్ సీట్లను పెంచడం, ఒక్కో సీటు మౌళిక వసతుల కల్పనకు రూ.1.50 కోట్లకు పెంచడం పట్ల వైద్య విద్యారంగ వ్యక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

పోతుగుంటకు రాజంపేటలో ఘన సన్మానం



రమేశ్‌నాయుడును సన్మానిస్తున్న స్నేహితులు, అభిమానులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా నియమితులైన పోతుగుంట రమేశ్‌నాయుడును శుక్రవారం శ్రీహరి ట్రేడర్స్, మిత్రులు స్థానిక ట్రేడర్స్ వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామివార్ల కృపా కటాక్షంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండదండలతో ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం హైదరాబాదు నుంచి శ్రీశైలం వరకు నాలుగులైన్ల రహదారిని నియమించేందుకు రూ.4వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇది మొదటి విడత అభివృద్ధి అని, శ్రీశైలానికి ఇంకా అభివృద్ధి పనులు వస్తాయన్నారు. కార్యక్రమంలో శ్రీహరి ట్రేడర్స్ యజమాని గుగ్గిళ్ల శ్రీహరి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంకటేశ్వర్లు, చిన్నయ్య, తలిశెట్టి రమేష్, నీలి చెంగారావు, వాణి, సుధా, అబ్దుల్లా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌ను కలిసిన రాయచోటి బీజేపీ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఛైర్మన్‌గా నియమించబడిన బీజేపీ నేత పోతుకుంట రమేశ్‌నాయుడును శుక్రవారం రాయచోటి బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు అరమాటి శివ గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్ రాజు, రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్రామరాజు, సుండుపల్లె సీనియర్ నాయకుడు వెంకటరాజు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎస్పీని కలిసిన జనసేన నేత రామశ్రీనివాస్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జిల్లా కార్యాలయంలో నూతన ఎస్పీ. ధీరజ్ కునుబిల్లిని శుక్రవారం రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ నాయకుడు రామశ్రీనివాస్ తన మిత్రబృందంతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామశ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల చర్యలు, నేర నియంత్రణ, రాజకీయ, కుల, మత, వర్గ ప్రాంతాలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాలకు, సామాన్య ప్రజలకు అన్ని రకాలుగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. స్పందించిన ఎస్పీ ధీరజ్ శాంతి భద్రతల పరిరక్షణ తమ ప్రథమ కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శివప్రసాద్, చరణ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని కలిసి మొక్కను అందిస్తున్న జనసేన పార్టీ నేతలు

నైపుణ్యం సాధించాలి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని జీసీడీవో సుమతి అన్నారు. ఏపీ మోడల్ స్కూల్ ఆటోనేటివ్ విభాగ విద్యార్థులకు గురువారం లక్కిరెడ్డిపల్లెలోని శివరాజేశ్ గ్యారేజ్‌లో ఐదు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కొత్త జ్ఞానం, ప్రేరణ, భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక వృత్తి విద్యలో ప్రత్యేక శిక్షణ కలిగి కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, వృత్తి విద్య సమన్వయకర్త దినకర్, ఒకేషనల్ ఉపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తికి దాణా అవసరం

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాల ఉత్పత్తి పెరగాలంటే పశువులకు దాణా చాలా అవసరమని ఏపీఎం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని యండపల్లిలో వీవోఏ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తి పెరగాలంటే కొత్త పశువులు కొనుగోలు అవసరమని, వీటికి సరైన పద్ధతిలో పోషక విలువలు కలిగిన ఫీడ్ అందించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఇన్సూరెన్స్ కూడా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులరెడ్డి, లైవ్ స్టాక్ డీపీఎం గంగార్జున, సీసీలు పాల్గొన్నారు.

4న వాహనాల వేలం

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ తనిఖీల్లో భాగంగా పట్టుబడిన వాహనాలను వేలం వేయుటకు ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో అక్టోబరు 4వ తేదీన రాజంపేట ఆర్టీసీ డిపోలో ఉదయం 10గంటల నుండి 11గంటల వరకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, ఇతర పత్రాలతో రూ.5 వేల రుసుం చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చునని ఆర్టీవో ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జనసేనలోకి రాజుకుంట యువ నాయకులు

చిట్వేలి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చిట్వేలి మండలం రాజుకుంటకు చెందిన ముగ్గురు ప్రముఖ యువనాయకులు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో జనసేనపార్టీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు, జనసేన రాజకీయ కార్యదర్శి, పార్టీ విప్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సమక్షంలో రైల్వేకోడూరు సీనియర్ నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి ఆధ్వర్యంలో మండలంలోని రాజుకుంటకు చెందిన యువ నాయకులు ఆనాల సునీల్, మాజీ సర్పంచ్ మాదినేని కనకరాజు, మాదినేని లోకేశ్, వారి సన్నిహితులు, కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఈ చేరికల పట్ల మండల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి గ్రామ పంచాయతిల అభివృద్ధికి కృషి చేయాలని జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుజాతమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతిపై సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పంచాయతీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోగా గీతాదేవి, ఎంపీటీసీ సుంకేసుల బాషా, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్యుల హక్కుల కోసం పోరాటం



నల్లబ్యాడ్జిలు ధరించి వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీపీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ హక్కుల కోసం పోరాడేందుకు సిద్ధమైందని యూనియన్ ట్రెజరర్ డాక్టర్ జొన్నగడ్డల రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రజలకు వ్యతిరేకంగా కాకుండా ప్రజలసేవలో ఉన్న వైద్యుల భవిష్యత్ కోసం పోరాడుతున్నామన్నారు. జీవో 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్దరణ, సమయ నిర్ధారితమైన ప్రమోషన్, ట్రైబల్ అలవెన్స్, 104 సంచార చికిత్స అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్స్ వంటి వాటి పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు తెలిపా రు. ఈ సమ్మె ఈనెల 26న ఆన్‌లైన్, రిపోర్టింగ్ సేవల బం ద్‌తో మొదలైందని, అలాగే 27న స్వస్థనారీ కార్యక్రమం, 104 సంచార చికిత్సలు, సేవలు బంద్ చేస్తామని, అలాగే 28న అధికారిక వాట్సాప్ గ్రూపు బహిష్కరణ, 29న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు బంద్, అదేవిధంగా 30న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, అక్టోబరు 1న జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ ప్రదర్శనలు, 3 నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్ట నున్నట్లు తెలిపారు. మొదటిరోజు నిరసనలో నల్లబ్యాడ్జిలు ధరించి వైద్యసేవలు అందించామని ఆయన తెలిపారు.

'పొదుపు..ఆర్థిక స్థిరత్వానికి దారి'

రాజంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చిన్న మొత్తంలోనైనా క్రమబద్ధమైన పెట్టుబడులు ప్రారంభించడం భవిష్యత్‌లో ఆర్థిక స్థిరత్వానికి దారి తీస్తుందని బెంగుళూరు పీఈఎస్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జె.మూర్తి తెలిపారు. స్థానిక అన్నమాచార్య యూనివర్శిటీ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్, కోటక్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన షేర్ మార్కెట్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్‌లు, సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లు, పెట్టుబడుల్లోని నష్టాలు, లాభాల గురించి వివరించారు. పెట్టుబడుల విభజన, ప్రాథమిక, ద్వితీయమార్కెట్‌ల పాత్ర వంటి అంశాలను అర్థమయ్యే రీతిలో తెలిపారు. మేనేజ్‌మెంట్ విభాగాధిపది డాక్టర్ టి.నవనీత విద్యార్థుల్లో ఆర్థిక విద్య ప్రాధానత్యపై అవగాహన పెరిగిందన్నారు. భవిష్యత్‌లో ఇది విద్యార్థులను బాధ్యతాయుతమైన పెట్టుబడిదారులుగా తీర్చిదద్దడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నానో ఎరువులతో ఎక్కువ ఆదాయం

చిట్వేలి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నానో ఎరువుల వాడకంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చునని విప్కో జిల్లా అధికారి మణిచంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక లక్ష్మీశ్రీనివాస పరస్పర సహకార సంఘం, ఎరువుల దుకాణంలో నానో ఎరువులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం సులభతరం కావాలంటే నానో టెక్నాలజీ ఎరువులను వాడాలన్నారు. నానో ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో దుకాణ యజమాని కొండూరు కృష్ణంరాజు, విప్కో ఉద్యోగి భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

● ప్రారంభించిన శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాల ఛైర్మన్ శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం ఎంజీపురం రాజీవ్ స్వగృహ ఎదురుగా ఉన్న మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాల ఛైర్మన్ కొండూరు శరత్‌కుమార్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ టోర్నీలో 14 టీమ్‌లు పాల్గొంటున్నాయని, ఒక్కో టీమ్‌కు 10ఓవర్లు ఉంటాయన్నారు. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.15వేలు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విజేతకు రూ.30 వేలు అందజేస్తున్న కొండూరు శరత్‌కుమార్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతన్నలూ.. జర భద్రం

● క్రిమిసంహారక మందుల పిచికారీతో అప్రమత్తత అవసరం
● అధికారుల సూచనలు పాటించండి ● నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం



పత్తిపంటకు పిచికారి చేస్తున్న రైతు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందులు అంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. అవి మన శరీరంలోకి వెళ్లినా, వాటి వాసనను పీల్చినా ఆరోగ్యానికి హానికరం. పంటలపై పురుగు మందులు పిచికారి చేయడంలో అవగాహన లేకపోవడం, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలతో రైతులు, వ్యవసాయ కూలీలు అనారోగ్యానికి గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలను ఆశించే చీడపీడల నివారణకు లేదా కలుపు నివారణకు మందులు పిచికారి చేస్తున్నారు. ఆ సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అవగాహన అవసరం

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగుమందులపై రైతులు అవగాహనను పెంచుకోవాలి. సంబంధిత దుకాణాల్లో నాలుగు రంగుల్లో పురుగుమందులు లభ్యమవుతున్నాయి. వీటిలో ఏవి విషపూరితమైనవి అనే విషయాన్ని తెలుసుకోవాలి. పుర్రెగుర్తుతో ఆకుపచ్చ, నీలి, పసుపురంగులతో కూడిన డబ్బాలు ఉంటాయి. పుర్రెగుర్తుతో కూడిన ఎర్రరంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నం ఉంటే తక్కువ విషపూరితమైనవని రైతులు తెలుసుకోవాలి.

మందు ప్రభావానికి గురైతే...

పురుగుమందుల ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి. మూర్చపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య వస్త్రం ఉంచాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటికప్పి వెచ్చగా ఉంచి సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలను వైద్యులకు తెలియజేయాలని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

● పురుగుమందు డబ్బా మూతను నోటితో తీయవద్దు, మందు ద్రావణాన్ని చేతితో కలపవద్దు. అవసరమైన మందు ఒకేసారి కలుపుకోవాలి.
● పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయవద్దు. పిచికారి సన్నగా తుంపర్లు పడేలా చూడాలి.
● మందు తగిన మోతాదులోనే పిచికారి చేయాలి. మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం.
● ఒకేసారి రెండు, లేదా మూడు రకాల పురుగుమందులు కలిపి పిచికారి చేయవద్దు.
● చేతులకు గ్లౌజులు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు ధరించాలి. పత్తిపంటలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
● ఉదయం, సాయంత్రం గాలివీస్తున్న సమయంలో వెళ్లి పిచికారి చేయాలి.
● పురుగు మందుల పిచికారి సమయంలో పొగతాగరాదు, గుట్కాలు తినవద్దు.
● గాయాలైన చేతులతో మందుపిచికారి చేయకూడదు. పిచికారి పూర్తి అయిన వెంటనే కాళ్లు చేతులు డెటాల్‌తో శుభ్రంగా కడుక్కోవాలి.
● చిన్నపిల్లలకు పురుగుమందులను సాధ్యమైనంత దూరంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.
● పిచికారి అనంతరం వినియోగించిన పురుగుమందుల డబ్బాలను గొయ్యితీసి పాతిపెట్టాలి.

క్రిమి సంహారక మందులు పిచికారి చేయడానికి వ్యవసాయశాఖ సూచించిన స్ప్రేయర్లు (పరికరాలు) మాత్రమే వాడాలి. పంట స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లకన్నా, లైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కలపై నేరుగా మందును పిచికారి చేయవచ్చు.

'అగ్రిసెట్'లో సాయిప్రశాంత్‌కు రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు



కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలికిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో అత్యున్నత అగ్రిసెట్ ర్యాంకు సాధించాడు. 2025-26 విద్యా సంవత్సరానికి వ్యవసాయ గ్రాడ్యుయేట్ కోర్సు (ఏజీబీఎస్సీ) లో ప్రవేశాల కోసం నిర్వహించిన అగ్రిసెట్‌లో స్థానిక వ్యవసాయ పాలి టెక్నిక్ కళాశాల విద్యార్థి ఎ.సాయి ప్రశాంత్ 5వ ర్యాంకు సాధించాడు. కడప జిల్లా దువ్వూరు మండలం రామ్‌సాయినగర్‌కు చెందిన ప్రభాకర్, లక్ష్మీదేవి (రైతు కుటుంబం) దంపతుల కుమారుడైన సాయిప్రశాంత్ కలికిరిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తిచేసి అగ్రిటెక్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు చేజిక్కించుకున్నాడు. సాయి ప్రశాంత్‌ను ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆర్టీసీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

● ఎండీ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

జమ్మలమడుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేసి లాభాల బాటలోకి తీసుకెళ్లాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సూచించారు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణాన్ని ఆయన సందర్శించారు. ముందుగా ఆర్టీసీ డిపో ప్రాంగణం పరిశీలించారు. ప్రయాణికులకు మౌలిక వసతులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై మాట్లాడారు. అక్కడి నుంచి డిపో గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 1997లో తాను కడప జిల్లా ఎస్పీగా పనిచేశానన్నారు. అప్పట్లో అప్పట్లో ఇరుకైన రోడ్లు, ఇంత అభివృద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నామని, వచ్చే మూడేళ్లలో అన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం విజయవంతమైందని, అందుకు ఆర్టీసీలో పనిచేస్తున్న మెకానిక్‌లు, సిబ్బంది కృషి ఉందన్నారు. డిపో నుంచి బస్సు బయటికి వెళ్లేటప్పుడు బస్సు కండీషన్‌ను మెకానిక్‌లు బాగా చూసి పంపిస్తే... ప్రయాణికులు క్షేమంగా గమ్యస్థానం చేరి సంస్థకు మంచి పేరు వస్తోందన్నారు. జమ్మలమడుగు డిపోలో ప్రస్తుతం 88 బస్సులు ఉన్నాయని, కొత్త బస్సులు వచ్చేదాకా ఉన్న బస్సులనే జాగ్రత్తగా కండీషన్‌లో నడపాలన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాయలకులు టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఇంకా ఏపీఎస్ఆర్ఏసీ, ఏపీఎస్ఎమ్‌డీసీ, ఏపీ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ లెక్చరర్‌గా, సెంట్రల్ గవర్నమెంట్ ఓఎన్ జీసీ, జీఏఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బీపీఎల్, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నృత్య, సంగీత కోర్సులలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలోని లలితకళల శాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్ణాటక సంగీతం, కీబోర్డు, సర్టిఫికెట్ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలను ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ అక్టోబరు 18వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పదేళ్లు వయసు నిండిన వారి నుంచి తర్వాత ఏ వయసు వారైన ఈ కోర్సుల్లో చేరవచ్చని చెప్పారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇడియు.ఇన్‌ను సంప్రదించాలన్నారు. అలాగే 9032595101 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఉద్యోగులు, కళాకారులు ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ప్రశాంతంగా గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో తాత్కాలిక ప్రతిపాదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, టౌన్‌ప్లానింగ్ విభాగాలకు సంబంధించి నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగాయి. అభ్యర్థుల అర్హతలు, బోధన నైపుణ్యం, అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన గెస్ట్ ఫ్యాకల్టీ జాబితాను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్ఎస్)లో 2025-26 విద్యాసంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడిట్ తరగతుల ప్రవేశాల గడువు అక్టోబరు 31 వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 14ఏళ్లు నిండిన వారు పదవ తరగతిలో, 15ఏళ్లు పైబడిన వారు లేదా టెన్త్ పాసైన వారు ఇంటర్మీడియట్‌లో చేరవచ్చన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్ స్కూల్.ఏపీ.జీఓవి.ఇన్ లేదా సమీప స్టడీ సెంటర్‌ను సంప్రదించ వచ్చని తెలిపారు.

సీబీఆర్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం నింపేందుకు చర్యలు



సీబీఆర్‌లోకి విడుదలవుతున్న నీరు

లింగాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)లో గరిష్ఠ నీటిమట్టం 10 టీఎంసీల మేర నింపేందుకు నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల జరిగిన మంత్రివర్గం సమావేశంలో ప్రాజెక్టులను, చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించడంతో ఆ మేరకు సీబీఆర్‌కు గండికోట నుంచి ఎత్తిపోతల ద్వారా నీటి విడుదలను అధికారులు పెంచారు. పీబీసీ ఈఈ వెంకటరామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సీబీఆర్‌లో 7.4టీఎం సీలు ఉన్నాయని, గండికోట ప్రాజెక్టు నుంచి మూడు మోటర్లతో 1400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల ద్వారా విడుదల చేస్తున్నామని, పూర్తిస్థాయిలో ప్రాజెక్టులో నింపుతామని తెలిపారు.

వార్డు కార్యదర్శికి రెండేళ్ల సెలవు మంజూరు

కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బుడ్డాయపల్లె వార్డు అమెనిటీస్ కార్యదర్శి కె.జ్యోతిర్మయికి రెండేళ్ల అసాధారణ సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె వ్యక్తిగత పనుల మీద సౌదీ అరేబియా వెళ్లడానికి అనుమతించింది. తన భర్త దగ్గరకు వెళ్లడం కోసం జ్యోతిర్మయి చేసుకున్న దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి 2027 సెప్టెంబరు 30వ తేదీ వరకు రెండేళ్లు సెలవు మంజూరు చేసింది. ఈ కాలానికి ఎలాంటి జీతాలు, అలవెన్సులు చెల్లించరు. అక్కడకానీ, ఇతర విదేశాల్లో కానీ ఆమె ఎలాంటి ఉద్యోగం చేయడానికి వీలు లేదు. సౌదీ అరేబియాలో నివాసం చిరునామాను ఉన్నతాధికారులకు తెలియజేయాలని షరతులు విధిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సెలవు మంజూరు ఆదేశాలను జారీ చేశారు.

సైనిక లాంఛనాలతో మాజీ సైనికుడికి అంత్యక్రియలు



లక్ష్మిరెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మిలటరీ పోలీసులు

చాపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుపల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం మాజీ సైనికుడు మూల క్రిష్టారెడ్డి (55)కి మిలటరీ పోలీసులు సైనిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈనెల 25న గురువారం ప్రొద్దుటూరు పట్టణంలోని తన ఇంటిలో లక్ష్మిరెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతని సొంత గ్రామం చెంచుపల్లె కావడంతో అంత్యక్రియలు ఇక్కడ నిర్వహించారు. మిలటరీ సైనికులు తుపాకులతో గాలిలోకి కాల్పులు జరిపి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా, ఆయన బెంగుళూరు, జమ్మూకాశ్మీర్ ప్రాంతాల్లో 15 ఏళ్లపాటు మిలటరీలో పనిచేశారు. ఆయనకు భార్య మల్లేశ్వరి, కుమార్తెలు రవీణారెడ్డి, రస్మికారెడ్డిలు ఉన్నారు. క్రిష్టారెడ్డి మృతి వార్త తెలిసిన చెంచుపల్లె, చిన్నవరదాయపల్లె, మడూరు, అన్నవరం గ్రామాల ప్రజలు ఆయన మృతదేహాన్ని చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

మోడల్ స్కూల్ ప్రాంగణంలో కంకర చోరీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ప్రాంగణంలో కంకర చోరీ అయినట్లు గుత్తేదారులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, చిన్నపరెడ్డి తెలిపారు. మోడల్ స్కూల్లో ఇటీవల పంచాయతీరాజ్ ద్వారా మోడల్‌స్కూల్ ప్రాంగణంలో మెయిన్‌రోడ్డు నుంచి పాఠశాల వెనుక వైపు ఉన్న బాలికల వసతి గృహం వరకు రూ.15లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేశారు. అయితే అక్కడ మిగిలిన కంకరను అక్కడే బాలికల వసతి గృహం వద్ద కుప్పగా తోసి ఉంచారు. కాగా ఈనెల 21వ తేదీ నుంచి పాఠశాలలకు దసరా సెలవులు కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్, పనిచేసే వాచ్‌మన్‌లకు తాళాలు ఇచ్చి వెళ్లిపోయారు. గుత్తేదారులు తమకు అవసరమైనప్పుడు మిగిలిన కంకరను తీసుకెళదామనుకున్నారు. శుక్రవారం ఉదయం కంకర కోసం వెళితే చోరీకి గురైనట్లు గుర్తించారు. పాఠశాలలో మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణ, పాఠశాలకు వాచ్ మన్ కూడా కంకర చోరీ అవడంపై గుత్తేదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 రెండో విడత జిల్లా ఎంపికలు ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యా అధికారి, స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ అండర్ 19 సెక్రటరీ చంద్ర మోహన్‌రాజు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం క్రీడా షెడ్యూలును తెలియపరిచారు. 27న కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ షటిల్ పోటీలు జరగనున్నాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి




శివకుమార్ మృతదేహం

జమ్మలమడుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లె గనుల వద్ద శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు అర్బన్ సీఐ నరేష్ బాబు సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా, మధ్యాహ్నం మృతుడి సోదరుడు సంపత్ పోలీసు స్టేషన్‌కు వచ్చి మృతదేహం తమ తమ్ముడిదేనని.. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీనివాసగర్‌కు చెందిన బుడ్డాయిపల్లె శివకుమార్ (36) గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈయనకు వివాహం కాలేదు. అనారోగ్య పరిస్థితుల వల్ల మందులు వాడేవాడు. ఘటనా స్థలంలో టీబీకి సంబంధించిన మందులు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

● కుమారుడికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన కోటకొండ రాము

రామాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని నల్లగుట్టపల్లి పంచాయతీ దర్గా రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటకొండ రాము (38) అనే వ్యక్తి లారీ కింద పడి మృతి చెందగా, అతని కుమారుడు జగదీశ్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ వడ్డెపల్లికు చెందిన కోటకొండ రాము తన కుమారుడు జగదీశ్‌తో కలిసి స్కూటర్‌లో రాయచోటిలోని అత్తగారింటికి వెళుతున్నాడు. మార్గమధ్యంలో రామాపురం సమీపంలో ఉన్న వైఎస్ఆర్‌కాలనీ వద్దకు రాగానే నిలబడి ఉన్న స్కూటర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జగదీశ్ రోడ్డు పక్కన పడగా, రాము అదే సమయంలో హైదరాబాదు నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ కిందపడ్డాడు. దీంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి తెలిపారు.

రిమ్స్‌లో శిశువులకు ఆధునిక ల్యాపరోస్కోపీ శస్త్రచికిత్సలు

● సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్



కోలుకున్న శిశువుతో సూపరింటెండెంట్, వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప (రిమ్స్) సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో పిల్లల శస్త్ర చికిత్స విభాగంలో ఆధునిక ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్సల సేవలు అందుబాటులో ఉన్నాయని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇవి సాధారణంగా మెట్రో నగరాలలో లక్షల రూపాయల ఖర్చుతో జరిగే శస్త్రచికిత్సలు అని, ఎన్‌టీఆర్ వైద్యసేవ ద్వారా సేవలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ నెల 23న రాజంపేటకు చెందిన 13 నెలల వయసు ఉన్న చిన్నారికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పైలోరిక్ స్టెనోసిస్ అనే జీర్ణాశయ సమస్యకు అరుదైన ల్యాపరో స్కోపిక్ చికిత్సను నిర్వహించారు. బాలిక పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ శిశువుల్లో పైలోరిక్ స్టెనోసిస్ అనేది ఆహారం ఆయం (ఆమాశయం) నుంచి చిన్న పేగులోకి వెళ్లే మార్గమైన పైలోరస్ కండరాల మందంగా మారడం వల్ల ఆ మార్గం బిగుసుకొని ఆహారం పేగులవైపు వెళ్లకుండా అడ్డం కావడం, అధిక వాంతులు, బరువు పెరగకపోవడం, తిన్న వెంటనే వాంతులు వీటి లక్షణాలు అన్నారు. అలాగే మూడు నెలల బిడ్డకు పెద్దదైన అండాశయ సిస్టును ల్యాపరోస్కోపిక్ కిస్టెక్టమీ ద్వారా తొలగించడం, ఒక సంవత్సరం వయసు అబ్బాయికి ఇంగ్వైనల్ హెర్నియాకు ల్యాపరోస్కోపిక్ హెర్నియోటమీ, పదేళ్ల అమ్మాయికి పిత్తాశయంలో రాళ్ల సమస్యకు ల్యాపరోస్కోపిక్ కొలిసిస్టెక్టమీ ద్వారా నయం చేశామన్నారు. ఈ శస్త్రచికిత్సలు సాధారణంగా ఓపెన్ సర్జరీగా చాలా చోట్ల జరుగుతుంటాయన్నారు. కానీ ల్యాపరోస్కోపిక్ విధానం ద్వారా చేయడం తక్కువ నొప్పితో, త్వరితగతిన కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సేవలు పిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ సుకుమార్ సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్యలోని ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఆర్థిక స్వావలంబన చేకూరేలా సంఘమిత్రలు, వెలుగు సీసీలు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండల మహిళా సమాఖ్య భవనంలో 15 మండలాల సీఆర్‌పీలతో పీడీ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, కొత్తగా ప్రవేశపెట్టిన డిజిటల్ లావాదేవీలపై సంఘాల సభ్యురాళ్లకు అవగాహన కల్పించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణాలను వారు నిర్వహిస్తున్న వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టేవిధంగా సూచనలివ్వాలన్నారు. అనవసరంగా రుణాలు తీసుకోకుండా అవసరమైన మేరకే రుణాలు తీసుకునేలా చైతన్యం తీసుకువాల్సి వుందన్నారు. సమావేశంలో బ్యాంకు లింకేజీ డీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ సాంబశివ, ఏపీఎం ఖిజర్‌ఖాన్, జిల్లా సమాఖ్య నాయకురాలు అలివేలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే...

- మహాలక్ష్మీదేవిగా రెడ్డెమ్మ తల్లి
- పీలేరులో కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ
- బి.కొత్తకోటలో మార్వాడీల దాండియా
- భక్తులతో కిక్కిరిసిన ప్రాంగణం



మహాలక్ష్మిగా బండ్లవంక నడివీధి గంగమ్మ (పీలేరు)





ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు - మహాలక్ష్మి అలంకరణలో దిన్నిమీది గంగమ్మ (పీలేరు) - బి.కొత్తకోటలో అన్నపూర్ణా దేవి అలంకరణలో దుర్గామాత



వెండి కవచంలో చౌడేశ్వరీ మాత (మదనపల్లె)

'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం - దాసీ భూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం - శ్రీ మన్మంద కటాక్ష లబ్ధ విభవత్ బ్రహ్మేంద్ర గంగాధరాం - త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం' అంటూ భక్తులు శ్లోకం చెబుతూ పరవశించి పోయారు. శరన్న వరాత్రోత్సవాల్లో ఐదోరోజు అమ్మవారిని మహాలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి భక్తులకు ధన సంపదలు కలిగేలా వేదపండితులు ఆశీస్సులు అందించారు. దేవాలయాల్లో 'ఓం శ్రీం హ్రీం క్లీం మహాలక్ష్మీ స్వాహా' మూల మంత్రంతో ఆలయాల్లో మహిళలు అమ్మవారిని అర్చించారు. 'నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే, శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మీ నమోస్తుతే' అంటూ ఆలయ పరిసరాలు మార్మోగాయి. అమ్మవార్ల దర్శనం కోసం మండలంలోని మహిళలు పోటెత్తారు. వివరాల్లోకెళితే...

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు వెండికవచంతో దర్శనం ఇచ్చారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మోడెం వెంకటరమణ, అధ్యక్ష, కార్యదర్శులు, పురాణం చంద్రశేఖర్, బండి పవన్ కుమార్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి అంజనేయులు, కౌన్సిలర్లు ఎస్వి రమణ, మందపల్లె వెంకటరమణ, రామిశెట్టి శివ పర్యవేక్షించారు. కోర్టులో గంగమ్మకు విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అర్ధనారీశ్వరి అలంకరణతో భక్తులకు గంగమ్మ వారి దర్శనం కల్పించారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, సభ్యులు పర్యవేక్షించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో లలితా సహస్రనామార్చనలో మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్ పర్యవేక్షించారు. సోమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీగా దర్శనం కల్పించారు. రాజరాజేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మీదేవి అలంకరించారు. బాట గంగమ్మ ఆలయంలో ధనలక్ష్మీ దేవి అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. కమ్మగడ్డవీధిలో నాదేళ్ల అరుణ్‌తేజ్ బృందంతో, ఈశ్వరమ్మ కాలనీలో యువత, ప్రశాంత నగర్‌లో యువత దుర్గామాతను ప్రతిష్ఠించారు.



దుర్గాదేవిగా మాతమ్మతల్లి (నిమ్మనపల్లి)



అర్ధనారీశ్వరి అలంకరణలో కోర్టులో గంగమ్మ (మదనపల్లె)

ఆకట్టుకున్న మార్వాడీల దాండియా

బి.కొత్తకోట, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ప్రతిష్ఠించిన దుర్గామాత పూజలు భక్తిపారవశ్యంతో, చెక్కభజనలు, భరతనాట్యం, దుర్గాపారాయణం, కోలాటం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు మహాలక్ష్మీదేవిగా, కాళీమాత ఆలయంలో పార్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

కురబలకోటలో....

కురబలకోట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరీ అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. నాగరాజగుప్త, రామకృష్ణ, బాలకృష్ణ సేతు మాధవ్, అమర్‌నాథ్, మారుతీ కుమార్, రామ్మోహన్, రాధారాణి, పుష్పలత, సరళ పర్యవేక్షించారు.

దుర్గాదేవిగా మాతమ్మతల్లి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పెద్దహరిజనవాడలో వెలసిన మాతమ్మతల్లి దుర్గాదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ఆలయం ముందు అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి పూజలు చేశారు.

పీటీఎంలో లక్ష్మీ సహస్ర నామార్చన

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీఅమ్మవారికి సహస్ర నామార్చన చేశారు. వేదపండితులు శేషాచలం శర్మ, సత్యనారాయణ శర్మచే లక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా తామరపువ్వులతో అలంక రించా రు. అనంతరం లక్ష్మీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ములకలచెరువులో....

ములకలచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని గజలక్ష్మీగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీలేరులో కిటకిటలాడిన ఆలయాలు

పీలేరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్ల దర్శనం కోసం మహిళలు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన మహిళలతో అమ్మవారి ఆలయాలు ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడాయి. శుక్రవారం అమ్మ వార్లను మహాలక్ష్మి అలంకరణ చేశారు. పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ, దిన్ని గంగమ్మ, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ, మోడల్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు కనువిందు కలిగించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు అమ్మవార్లను కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. తలపుల సమీపంలోని ఉలవల గంగమ్మ, తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి దేవీ, అగ్రహారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కన్యకా పరమేశ్వరి అమ్మవారు మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో సాయంత్రం అర్చకులు మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆలయాల కమిటీ చైర్మన్‌లు కె.రామకృష్ణారెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణా రెడ్డి, రామిరెడ్డి, వెంకటమ్మ, శేఖర, ఈఓ మంజుల, సభ్యులు షామియాన జయన్న, భాస్కర రెడ్డి, అర్చకులు చంద్రశేఖర శర్మ, ఆంజనేయులు, భరత్ స్వామి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా రెడ్డెమ్మ తల్లి

గుర్రంకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, అభిషేకాలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మహాలక్ష్మీదేవిగా భక్తులను కనువిందు చేశారు. గుర్రంకొండ పోలేరమ్మ అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులను కరుణించారు. తరిగొండ వాసవీ మాత ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.



లక్ష్మీదేవిగా పోలేరమ్మ (గుర్రంకొండ)

అన్నపూర్ణాదేవిగా చౌడేశ్వరీ అమ్మవారు

కలకడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనలో వెలసిన చౌడేశ్వరీదేవి శుక్రవారం అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కలకడలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయాల్లో అలంకరణల శోభ

వాల్మీకిపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయాల్లో అలంకరణల శోభ సంతరించుకుంది. పట్టణంలోని నల్లవీరగంగా భవానీ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, బోయకొండ గంగమ్మ ఆలయం, గండబోయనపల్లె సత్యమ్మతల్లి ఆలయం, చింతపర్తి వాసవీ అమ్మవారి ఆలయం, గొల్లపల్లె విరూపాక్షమ్మ తల్లి దేవాలయాల్లో అభిషేకాలు, పూజల అనంతరం అమ్మవార్లను మహాలక్ష్మీ దేవిగా విశేషాలంకరించారు. కోనేటి వీధిలోని లక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారి లలితాదేవిగా పూజలు నిర్వహించారు. ఆలయాల ధర్మకర్తలు ముర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి, పులి సత్యారెడ్డి, కువైట్ శంకరాచారి, తబ్జూల సతీష్, కాంతరాజుశెట్టి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, ఉత్తన్నస్వామి, జనార్ధనస్వామి,కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిగా కలికిరి యల్లమ్మ

కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యల్లమ్మ తల్లి సాక్షాత్తు నిలువెత్తు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు అభయం నొసంగారు. ఉదయం అభిషేకాల అనంతరం అమ్మవారిని లక్ష్మీదేవి అలంకారంతో తీర్చిదిద్దారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.



ములకలచెరువులో గజలక్ష్మీగా...

పశువుల రోగాలపై అప్రమత్తంగా ఉండాలి



పశువుల పెంపకదారులకు మందులు అందజేస్తున్న శ్రీనివాసులనాయుడు

కురబలకోట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పశువులకు రోగాలు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు శ్రీనివాసనాయుడు, ఏడీ శ్రీధర్‌రెడ్డి పశుపెంపకం దారులకు సూచించారు. శుక్రవారం కమతంపల్లెలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పాడిరైతులకు అవగాహన చేపట్టిన ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంట వ్యాధి సోకకుండా నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. లేగదూడ, చూడిఆవుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలను తెలియజేశారు. సుమారు 70పాడి ఆవులకు వైద్యం చేసి రైతులకు మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం అంగళ్లలో పశువైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏడీ శ్రీధర్‌రెడ్డి, వైద్యులు నవీన్, సుజనశ్రీ, నవ్యశ్రీ, టీడీపీ నేత ఎస్.సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వెలుగు వీఓఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని వీఓఏ అసోసియేషన్ నేతలు డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మదనపల్లెకు వచ్చిన పీడీతో వీఓఏలు మాట్లాడుతూ తమకు 5జీ మొబైల్స్ పంపిణీ చేసేంత వరకు ఆన్‌లైన్ పనులు చేయలేమని స్పష్టం చేశారు. ప్రతి పనికీ లక్ష్యాలను ఇచ్చి వీఓఏలపై వత్తిడి తెస్తున్నారన్నారు. పెండింగ్ వేతన బకాయిలను చెల్లించాలని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వీఓఏలు దివ్యజ్యోతి, రాణి, రెడ్డెప్పరెడ్డి, రామాంజులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లాలి ఆరోగ్యమే ఇంటికి బలం

పీలేరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇల్లాలి ఆరోగ్యమే ఇంటిల్లిపాదికీ బలమని రేగళ్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బాలంవారిపల్లెలో స్వస్థ్ నారీ-స శక్త్ పరివార్‌లో ఆయన మాట్లాడుతూ ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, ఇల్లాలి ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ-స శక్త్ పరివార్ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాధామాధవి, సుబ్రహ్మణ్యం, శైలజ, సర్పంచ్ నాగమ్మ, మాజీ సర్పంచ్ సురేంద్రా రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది కృష్ణమ్మ, మోహన్, రాజా, చిన్నప్ప, మనోహర్, శివప్రసాద్ బాబు, నాగప్రణీత, కవిత, అమ్మాజీ, నందిని, చంద్రలేఖ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

ములకలచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా ఉంటోందని నియోజకవర్గ టీడీపీ మహిళ నేత కల్పనరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో 26 మందికి మంజూరైన రూ.20.56లక్షల చెక్కులను ఆమె అందజేశారు. నేతలు మొటుకు శివ, భజంత్రీ రామాంజులు, మస్తాన్‌రెడ్డి, శ్రీనివాసులు, కట్టా హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పూనుకున్న నరసింహులు (38) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ములకలచెరువు మండలం, గంగివారిపల్లె వాసి నరసింహులు కొన్నేళ్లుగా మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరీనగర్‌లో చేనేత కూలీ మగ్గాల కార్మికుడుగా జీవిస్తున్నాడు. మగ్గాలు నడవక పోవడంతో చేసిన అప్పు తీర్చలేక బుధవారం మధ్యాహ్నం క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. తిరుపతిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

వాటర్‌షెడ్ వివాదం విచారణ

ములకలచెరువు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మడమూరు వాటర్‌షెడ్ పనుల్లో నెలకొన్న వివాదంపై వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మీనరసయ్య శుక్రవారం విచారణ చేపట్టారు. వాటర్‌షెడ్ పనుల్లో టీడీపీ, వైసీపీ మధ్య వివాదం నెలకొంది. దీనిపై వాటర్‌షెడ్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో వాటర్‌షెడ్ ఏపీడీ విచారణ చేపట్టేందుకు ములకలచెరువుకు సీఎల్ఆర్‌సీ భవనానికి రెండు వర్గాలను పిలిపించి వేర్వేరుగా విచారించారు. నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల వచ్చే వరకు మడుమూరులో వాటర్‌షెడ్ పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని ఏపీడీ ఆదేశాలు జారీ చేశారు. వాటర్‌షెడ్ పీఓ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టమోటాల కొనుగోలులో రైతులను ఇబ్బందులు పెడితే వ్యాపారులపై చర్యలుంటాయని కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మాలతి హెచ్చరించారు. శుక్రవారం ఉదయాన్నే ఆమె మార్కెట్‌లో టమోటా కొనుగోళ్లు, అమ్మకాల తీరుతెన్నులను పరిశీలించారు. మండీల యజమానులతో ఎలాంటి సమస్యలున్నా వెంటనే కమిటీకి తెలియజేయాలని రైతులను కోరారు. రైతులకు గిట్టుబాట ధర అందేలా వ్యాపారులు, మండీల యజమానులు సహకరించాలన్నారు. రైతులకు అన్యాయం జరిగితే తప్పక విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. రోజువారీ ధరల నిర్ణయంలో రైతులను కూడా భాగస్వాములను చేయాలని మాలతి సూచించారు. డైరెక్టర్లు శ్రీనివాస వర్మ, రాంబాబులతో కలిసి రైతులు, వ్యాపారులు, మండీ యజమానులతో మాట్లాడారు. సమష్టిగా పారదర్శకంగా వ్యవహరిస్తే రైతులకు మేలు చేసిన వారవుతామని గుర్తించాలని ఆమె కోరారు.

బద్దిపల్లి హౌసింగ్ కాలనీకి మోక్షం



బద్దిపల్లి కాలనీలో మరమ్మతులు చేసిన రోడ్డు

బి.కొత్తకోట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బద్దిపల్లి హౌసింగ్ కాలనీ రోడ్లకు ఎట్టకేలకు కాస్త మోక్షం లభించింది. వాహనాల రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేక ఇళ్లనిర్మాణాలకు లబ్ధిదారులు అష్టకష్టాలు పడ్డారు. నిర్మాణ సామగ్రిని మోసుకుని మరీ నిర్మాణాలు చేపట్టారు. రోడ్డు నిర్మాణం చేయండి మొర్రో అని ఎంత మొరపెట్టుకున్నా అధికారుల్లో ఏళ్ల తరబడి చలనం లేకపోయింది. ఇటీవల జిల్లా హౌసింగ్ పీడీ రమేష్ రెడ్డి కాలనీలో పర్యటించారు. అంతర్గత రోడ్ల దుస్థితిని చూసి, వెంటనే మరమ్మతు చేయాలని కమిషనర్‌కు సూచించడంతో కమిషనర్ పల్లవి స్పందించి వీధుల్లో జంగిల్‌క్లియరెన్స్, బండరాళ్ల తొలగింపు చేపట్టారు. రోడ్లకు ఓ రూపు ఏర్పడిందని, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. కార్యక్రమాన్ని హౌసింగ్ ఏఈ జియాఫుజైల్ పర్యవేక్షించారు.

ఉలవలు పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలి

ములకలచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేసి ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రం ఎదుట శుక్రవారం సీపీఐ నేతలు నిరసన చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు బాగా కురవడంతో ప్రత్యామ్నాయ పంటగా రైతులు ఉలవలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఏటా రైతులకు సబ్సిడీతో అందిస్తున్న ఉలవలు ఇంత వరకు పంపిణీ చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు కేవలం 20 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వెంటనే సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేయాలన్నారు. నేతలు రామచంద్ర, శంకరప్ప, సుబ్బన్న, రమణప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే సురక్షితమైన కాన్పులు

గుర్రంకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షితమైన కాన్పులు అందుతున్నాయని డీహెచ్ఏ మహ్మద్‌రఫీ అన్నారు. తరిగొండ, రామాపురం గ్రామాల్లో శుక్రవారం సురక్షిత కాన్పులపై అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేసుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు. మాతాశిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సర్పంచ్ ఆనంద్, డాక్టర్ చిన్న రెడ్డెప్ప, హరినాథ్, నాగిరెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీకి యత్నం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్కంటి సన్నిధి హుండీలో భక్తుడు సమర్పించే నగదు కానుకను చోరీ యత్నంలో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. భక్తులు అప్రమత్తమై అతన్ని పోలీసులకు అప్పగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. రామసముద్రం వాసి వీరప్ప నారాయణ శ్రీకాళహస్తికి వచ్చాడు. స్వామి దర్శనం అనంతరం సహదేవరెడ్డి రూ.200 హుండీలో వేస్తుండగా వీరప్ప కానుకను పట్టుకునే ప్రయత్నం చేశాడు. భక్తుడు ఆలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో శ్రీకాళహస్తి సీఐ గోపి వీరప్ప నారాయణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశాడు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పురోగతి సూచిక 2.0పై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ కృష్ణప్రసాద్ శిక్షణ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2030 నాటికి రాష్ట్రం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు పంచాయతీరాజ్ సంస్థల సామర్థ్యాల పెంపు, పనితీరు పర్యవేక్షణకు పురోగతిరాజ్ మంత్రిత్వ శాఖ (ఎంఓపీఆర్) రూపొందించిన పంచాయతీ పురోగత సూచికలపై శిక్షణ ఇచ్చారు.

పంచాయతీ వనరుల అభివృద్ధిపై...

వాల్మీకిపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సొంత ఆదాయ వనరులు, అభివృద్ధిపై శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ మనోహర్‌రాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల రూప కల్పన ద్వారా అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, అధికారులు, సర్పంచులు, పాల్గొన్నారు.

గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ థామస్ రాజా అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పురోగతి పైన శిక్షణ చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి వారే కీలకం

పెద్దమండ్యం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ పురోగతిపై ఒక రోజు శిక్షణలో వారు మాట్లాడుతూ పన్నులు వసూళ్లు తప్పని సరిగా చేయాలి. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.